సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 10 । జనవరి । 2025



సేవలు ఎలా ఉన్నాయి?

ఫిర్యాదుదారులతో పోలీసుల ప్రవర్తన, సేవలు తెలుసుకునేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 8లో



రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 16°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం మంచు ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదైనా రాత్రికి మళ్లీ చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

21లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

ఖమ్మం సహకారనగర్: ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు రాయనున్న విద్యార్థులు తత్కాల్ విధానంలో ఫీజు చెల్లించేందుకు ఈనెల 21వ తేదీ వరకు గడువు ఉందని డీఈఓ ఈ.సోమశేఖర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రూ.వెయ్యి అపరాధ రుసుంతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల అభివృద్ధికి పాటుపడే స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఎన్.విజయలక్ష్మి తెలిపారు. 2024–25 ఏడాదికి జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. సంస్థల బాధ్యులు ఫిబ్రవరి 15వ తేదీలోగా http:/ngo.tribal.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని, ఆ ప్రతులను తమ కార్యాలయంలో అందజేయాలని డీడీ ఓ ప్రకటనలో సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యంపై డీసీసీబీ ఉద్యోగులకు మెమోలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలోని ఓ బ్రాంచ్ ఉద్యోగులు విధుల్లో నిబంధనలు ఉల్లంఘించిన వ్యవహారం వెలుగుచూసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం బ్రాంచ్‌లో ఉన్నతాధికారులు ఇటీవల ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ జరిపించగా పలు తప్పిదాలు బయటపడ్డాయి. దీంతో బాధ్యుడైన ఉద్యోగికి తేడా సరిచేసేందుకు అవకాశం కల్పించగా ఆయన సర్దుబాటు చేశారు. ఆయనతో పాటు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంకో ఇద్దరికి కలిపి మెమోలు జారీ చేశారు. ఈ మెమోలకు వారు ఇచ్చే జవాబు ఆధారంగా చర్యలు తీసుకునున్నారు. కాగా, ఆర్థిక లావాదేవీల అంశం కావడంతో ఓ ఉద్యోగిని సస్పెండ్‌చేసే అవకాశముందని తెలిసింది. ఈ వ్యవహారంపై బ్యాంకు సీఈఓ వెంకటఆదిత్యను గురువారం వివరణ కోరగా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలడంతో ఉద్యోగులకు మెమోలు జారీ చేశామని తెలిపారు.

ఇంగ్లిష్ నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

రఘునాథపాలెం: విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. మండలంలోని మంచుకొండ జెడ్పీహెచ్‌ఎస్‌ను మగురువారం తనిఖీ చేసిన ఆయన బోధనను పరిశీలించడంతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేశారు. పలువురితో ఆంగ్లంలో మాట్లాడించి మెళకువలను వివరించారు. అలాగే, పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ వహిస్తూ బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల హెచ్‌ఎం ఆర్.కరుణకుమారి, ఉపాధ్యాయులు ఆంజం రాజు, నజీమా, శ్రీను, భానుమతి, ఆర్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగింపు దశకు ధాన్యం కొనుగోళ్లు

- ఇప్పటివరకు 2,42,980.520 మె.టన్నుల ధాన్యం సేకరణ

ఖమ్మం సహకారనగర్: జిల్లా రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేస్తుండగా ప్రక్రియ ముగింపు దశకు చేరింది. జిల్లాలోని 344 కేంద్రాల ద్వారా 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో ఇప్పటివరకు 42,440మంది రైతుల నుంచి 2,42,980.520 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఈ ధాన్యంలో గ్రేడ్–ఏ(సన్నాలు) ధాన్యం 2,24,766.200మెట్రిక్ టన్నులు, కామన్ రకం 15,714.320మెట్రిక్ టన్నులుగా నమోదైంది. ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో గురువారం నాటికి రూ.560,15,25,200 జమ అయ్యాయని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత తెలిపారు. కాగా, కొనుగోళ్లు పది రోజుల్లో ముగిసే అవకాశముందని ఆమె వెల్లడించారు. మధిర, వైరా, బోనకల్, ముదిగొండ వారం, పది రోజుల్లో అధికంగా ధాన్యం వస్తుందని తెలిపారు.

అలలపై నా స్వామి!





గోదావరి నదిలో హంసవాహనంపై విహరిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి వారు





తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భారీగా హాజరైన భక్తులు

భద్రగిరిలో వైభవంగా తెప్పోత్సవం

- ఊరేగింపుగా గోదావరి తీరానికి రామయ్య
- వేదమంత్రోచ్చరణలతో హంస వాహనంలో వేంచేపు
- సాయంత్రం 6–01 గంటలకు మొదలైన వేడుక
- గంటపాటు కొనసాగిన జలవిహారం
- గోదావరి తీరానికి పోటెత్తిన భక్తులు

వేద పండితుల మంత్రోచ్చరణలు, భక్త జనుల జయజయ ధ్వానాల నడుమ సీతాలక్ష్మణ సమేతుడైన రామచంద్రస్వామి గోదావరిలో జల విహారం చేశారు. రాములోరి నదీ విహారంతో గోదావరి తల్లి పులకించగా ఈ దృశ్యాలను చూస్తూ భక్తులు రామనామ స్మరణ చేశారు. దీంతో భద్రగిరి క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం పవిత్ర గోదావరి నదిలో తెప్పోత్సవం కనుల పండువగా సాగింది.

– భద్రాచలం

దర్బార్ సేవ అనంతరం..

పగల్ పత్తు ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తుల వద్ద విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఉదయం సేవాకాలం, తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం జరిపించారు. మధ్యాహ్నం రాజభోగం, శాత్తుమురై, పూర్ణ శరణాగతితో పగల్ పత్తు వేడుక ముగిసింది. గర్భగుడిలో ప్రభుత్సోత్సవం(దర్బార్ సేవ) నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ స్వామివారిని ఊరేగింపుగా గోదావరి తీరానికి తీసుకెళ్లారు. పల్లకీ ముందు పలువురు కోలాటమాడుతుండగా, స్వామి వారిని దర్శించుకునేందుకు దారి పొడవునా భక్తులు బారులుదీరారు. గోదావరి తీరానికి చేరాక అర్చకులు పుణ్యజలాలతో హంస వాహనాన్ని సంప్రోక్షణ చేశారు. ఆ తర్వాత స్వామి వారిని హంసవాహనంలో ఏర్పాటు చేసిన పచ్చిపూల మండపంలో తూర్పు ముఖంగా వేంచేపు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేదాలు, నాళాయిర దివ్య ప్రబంధం, పంచసూత్రాలు, స్తోత్రాలు పఠించారు. అనంతరం మంగళహారతి, చక్రపొంగలి నివేదనతో పాటు సుమారు గంట పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా హారతి ఇచ్చి దర్శనానికి అనుమతి ఇచ్చారు.

ఉత్తర ముఖంగా..

ఆగమ శాస్త్ర పూజాదికాలు పూర్తయ్యాక సాయంత్రం 6–07 గంటల సమయంలో ఉత్తర ముఖంగా గోదావరి నదిలో హంస వాహనం కదిలింది. విద్యుద్దీప కాంతులతో ధగధగా మెరుస్తున్న హంస వాహనం, అందులో ఆశీనులైన సీతారాములను చూసేందుకు భక్తులు పోటీ పడ్డారు. తెప్పోత్సవం మొదలైన వెంటనే నదికి ఆవలి తీరంలో బాణసంచా కాల్చడం ప్రారంభమైంది. ఒక్కో పరిక్రమాణానికి సగటున 10 నిమిషాల సమయం పట్టింది. మొత్తంగా ఆరు పరిక్రమణాలు రాత్రి 7–01 గంటలకు పూర్తయ్యాయి. తెప్పోత్సవం ముగిసిన అనంతరం సీతారాములను తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరి తీరంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ఏరు ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ వేదికపై శాస్త్రీయ, గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. తెప్పోత్సవానికి పల్లకీలో స్వామి వారు వెళ్లే సమయంలో పల్లకీ ముందు వివిధ కోలాట సంస్థల ఆధ్వర్యంలో మహిళలు చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పురుషోత్తపట్నం నుంచి వచ్చిన మహిళల బృందం చేసిన డప్పు నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కట్టుదిట్టమైన భద్రత..

తెప్పోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ రోహిత్‌రాజ్ పర్యవేక్షించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, గృహనిర్మాణ శాఖ ఎండీ వీ.పీ.గౌతమ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సతీమణి మాధురి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు హాజరయ్యారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

- బ్రహ్మ ముహూర్తంలో ప్రారంభం కానున్న పూజాదికాలు
- రెండు గంటలకు పైగా రామయ్యకు ప్రత్యేక పూజలు

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున శ్రీ సీతారామచంద్రస్వామి వారు భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమివ్వనున్నారు. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే జరిగే ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు ఇప్పటికే భద్రగిరికి పోటెత్తారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

వేద మంత్రాల నడుమ..

ముక్కోటి ఏకాదశి రోజున బ్రహ్మ ముహూర్తంలో ప్రత్యేక వాహనంపై ఆశీసులైన లక్ష్మణ సమేత సీతారాములను ఉత్తర ద్వారం దగ్గర కొలువుదీరుస్తారు. వైకుంఠ ఏకాదశి వైభవం, మంగళ వాద్యఘంట, వేద పారాయణం అనంతరం.. వినతాసుత వాహన కీర్తన నాదస్వరం, ఆరాధన, శ్రీరామ షడాక్షరి మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన వంటి పూజాదికాలు నిర్వహిస్తారు. ఉత్తర ద్వార దర్శన ప్రాశస్త్యాన్ని స్థానాచార్యులు స్థలశాయి వివరిస్తారు. ఆ తర్వాత 108 ఒత్తులతో హారతినిస్తూ శరణాగతి గద్య విన్నపం చేపడతారు. చివరగా కోదండపాణి కీర్తన ఆలపిస్తూ వైకుంఠ ద్వారం తెరిచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

పూజా విశేషాలు ఇలా..

- తెల్లవారు జామున 3 నుంచి 4–30 గంటల వరకు సంగీత కళాకారులు, దేవస్థానం హరిదాసులచే కీర్తనాలాపనలు
- 4–30 నుంచి 5 గంటల వరకు వైకుంఠ ఏకాదశి వైభవం
- 5 నుంచి 5–30 గంటల వరకు వివిధ మంగళ వాయిద్యాలు, వేదపారాయణం, వినతాసుత వాహన కీర్తన నాదస్వరం, శ్రీరామ షడాక్షరి మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన
- ఉదయం 5.30 నుంచి 5–40 వరకు ఉత్తర ద్వార దర్శన విశిష్టత వివరణ, 108 ఒత్తులతో హారతి, శరణాగతి గద్యవిన్నపం
- 6గంటలకు ఉత్తర ద్వారాలు నెమ్మదిగా తెరుచుకుంటుండగా ధూపాన్ని చీల్చుకుంటూ హారతి వెలుగులు.. ఆ తర్వాత లక్ష్మణ సమేత సీతారాముల వారి దర్శనం

దందాలో రా‘రాజు’లు

- వేళ్లూనుకుపోయిన రేషన్ బియ్యం అక్రమార్కులు
- జిల్లా కేంద్రంలో చక్రం తిప్పుతున్న ముగ్గురు
- పలుమార్లు పీడీ యాక్టు నమోదు చేసినా మారని తీరు
- వీరి మధ్య విబేధాలతో ఇటీవల బయటపడుతున్న అక్రమాలు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రేషన్ బియ్యం దందా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేళ్లూనుకుపోయింది. గత ఏడాది ప్రతీ నెలలో సగటున ఏడు వరకు కేసుల వరకు నమోదయ్యాయంటే దందా ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఓ వైపు టాస్క్‌ఫోర్స్ బృందాలు, మరో వైపు పౌరసరఫరాల యంత్రాంగం తనిఖీలు చేపడుతున్నా బియ్యం కొనుగోళ్లు, అమ్మకాలకు చెక్ పడడం లేదు. ఖమ్మం నగరానికి చెందిన ముగ్గురు ఇందులో కీలకంగా వ్యవహరిస్తుండగా, వీరిపై పలుమార్లు పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపినా బయటకు రాగానే ఇదే మార్గం అనుసరిస్తున్నారు. ఇందులో ఒకరు బృందానికి రా‘రాజు’లా చెలామణి అవుతున్నాడనే ప్రచారం జరుగుతోంది. అయితే, వీరి నడుమ ఇటీవల ఏర్పడిన విబేధాలతో అక్రమాలు అధికారుల దృష్టికి చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈనెల 7న ఖమ్మం ఇండస్ట్రియల్ ఏరియాలో 600 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకోవడానికి బృందంలోని ఒకరు అధికారులకు సమాచారం ఇవ్వడమే కారణమని సమాచారం.

ఏడాదిలోనే మూడు వేల క్వింటాళ్లు..

గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు సుమారు మూడు వేల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ప్రతీ నెలా రేషన్ బియ్యం పట్టుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ గణాంకాలు చెబుతున్నాయి. ఇంత మొత్తంలో రేషన్ బియ్యం పట్టుబడుతుండగా, నిఘా వ్యవస్థల కళ్లుగప్పి ఇంకా ఎంత మేర బియ్యాన్ని ఉమ్మడి జిల్లా సరిహద్దు దాటించారో ఊహించుకోవచ్చు. రేషన్ డీలర్లు, లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరణకు ప్రతీ మండలంలో ఏజెంట్లను నియమించుకున్నట్లు తెలిసింది. వీరి ద్వారా ఖమ్మం నగరానికి చెందిన ముగ్గురు బియ్యాన్ని సేకరించి ఏపీలోని కాకినాడ పోర్టుకు, ఆపై ఇతర దేశాలకు తరలిస్తున్నారని సమాచారం. అధికారులకు సమాచారం తెలిసినప్పుడు తనిఖీలు చేపట్టి బియ్యం స్వాధీనం చేసుకుంటున్నా, మిగతా సమయాల్లో రాత్రింబవళ్లు తేడా లేకుండా వేల క్వింటాళ్ల బియ్యం తరలిపోతోందని తెలిసింది.

భారీ ఎత్తున పట్టుబడడంతో..

మునుపెన్నడూ లేని విధంగా జిల్లాతో పాటు ఖమ్మం నగరంలో భారీగా రేషన్ బియ్యం పట్టుబడుతోంది. జిల్లా కేంద్రంలో 600 బస్తాల బియ్యం పట్టుబడడంతో దందాకు అంతులేకుండా పోయిందనే విషయం తేలిపోయింది. నగరం చుట్టూ చెక్ పోస్టులు, పలు కూడళ్లలో సీసీ కెమెరాలు ఉన్నా ఇండస్ట్రియల్ పార్క్‌లోని గోదాంలో బియ్యాన్ని నిల్వ చేయగా, అధికారులు స్వాధీనం చేసుకోకపోతే రెండు, మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లా సరిహద్దు దాటించే వారని సమాచారం. అయితే, దందాలో వేళ్లూనుకుపోయిన ముగ్గురి నడుమ ఇటీవల విబేధాలతో రావడంతోనే సమాచారం బయటపడినట్లు తెలిసింది. కాగా, అధికారులు ఇకనైనా తనిఖీలు ముమ్మరం చేసి అక్రమార్కులకు అడ్డుకట్ట వేయకపోతే దందా మరింత విస్తృతమయ్యే అవకాశం కనిపిస్తోంది.

సహకరిస్తే సరి.. లేకపోతే..

రేషన్ బియ్యం అక్రమ వ్యవహారంలో ఖమ్మంకు చెందిన ముగ్గురు కీలక పాత్రధారులుగా ఉండగా, వీరిపై గతంలో పలుమార్లు పీడీ యాక్టు నమోదు చేయడంతో జైలుకు వెళ్లివచ్చారు. అయినా ఆదాయం మెరుగ్గా ఉండడంతో పాత పంథాను విడనాడకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేకరించిన బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలిస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే వీరు రూ.కోట్లకు పడగలెత్తి వ్యవస్థలను శాసిస్తామనే రీతిలో వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. లబ్ధిదారులకు పంపిణీ చేయగా రేషన్ దుకాణాల్లో మిగిలిన బియ్యాన్ని కూడా తమకే విక్రయించాలని బెదిరిస్తూ ఎవరైనా మాట వినకపోతే యంత్రాంగంతో బెదిరింపులకు గురిచేయడం లేదా తనిఖీలు చేయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

రైతు భరోసాకు రూ.10 వేల కోట్లు

- వచ్చే ఖరీఫ్ నుంచి పంటల బీమా పథకం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నూతనకల్‌లో పీఏసీఎస్ భవనం, గోదాంను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన ఎమ్మెల్యే రాగమయి తదితరులు

తల్లాడ: రాష్ట్రంలో రైతు భరోసా అమలుకు రూ.10 వేల కోట్లు వెచ్చించనుండగా, అందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. తల్లాడ మండలం నూతనకల్‌లో నాబార్డు నిధులతో నిర్మించిన పీఏసీఎస్ కార్యాలయ భవనం, గోదాంను గురువారం ఆయన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఎకరాకు రూ.12వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే, వచ్చే ఖరీఫ్ నుంచి రాష్ట్రంలో 70లక్షల మందికి రైతులకు పంటల బీమా పథకాన్ని అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఈపథకం ద్వారా దిగుబడి తగ్గినా, పంట నష్టపోయినా అండగా ఉంటుందని చెప్పారు. కాగా, ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలకు ఏడాదిలోగా సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందిస్తామని, ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని మంత్రి తెలిపారు. ఇప్పటికే ప్రాజెక్టుకు వెచ్చించిన రూ.8 వేల కోట్లకు తోడు మరో రూ.8 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు వివరించారు. ఇప్పటికే రైతులకు రుణమాఫీ చేశామని, రైతుబీమాకు రూ.3 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి గంగాధర్, డీసీసీబీ సీఈఓ వెంకట్‌ఆదిత్య, గంగదేవిపాడు పీఏసీఎస్ చైర్మన్ తూము వీరభద్రరావుతో పాటు ఆర్డీఓ రాజేందర్ గౌడ్, తహసీల్దార్ వనజ, ఎంపీడీఓ చంద్రమౌళి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు దిరిశాల నర్సింహారావు, గణేశుల రవి, కాపా సుధాకర్, అనుమోలు బుద్ధిసాగర్, జక్కంపూడి కిషోర్, వీరారెడ్డి, దీవెల కృష్ణయ్య, అడపా అనిల్, నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కాగా, బిల్లుపాడులో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి విగ్రహ ఏర్పాటుకు మంత్రి భూమి పూజ చేశారు.

తొలి ఏడాదిలోనే 11వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీ

ఖమ్మం సహకారనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 11వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేయగా, ఏటా ఖాళీ అయ్యే పోస్టులను సైతం ఎప్పటికప్పుడు భర్తీ చేస్తామని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం టేకులపల్లిలోని డైట్‌లో పరిపాలనా భవనం ఆధునికీకరణ, అదనపు సదుపాయాల ఏర్పాటు పనులకు అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 70ఏళ్లలో అనేక కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన స్థాయిలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయలేకపోయామని తెలిపారు. నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయుల కొరతతో విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయన్నారు. ఈమేరకు డైట్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులను ఉత్తమ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ డైట్‌లో వసతులను సద్వినియోగం చేసుకుంటూ పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులను సిద్ధం చేయాలని సూచించారు. మేయర్ పునుకొల్లు నీరజ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, డీఈఓ సోమశేఖరశర్మ, ఆర్డీఓ నర్సింహారావు, ఈఈ రంజిత్, కృష్ణలాల్, తహసీల్దార్ రవికుమార్‌తో పాటు డి.సత్యనారాయణ, లకావత్ సైదులు, కమర్తపు మురళి, రావూరి సైదబాబు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యంతో ప్రాణాలకు ముప్పే

ఖమ్మంవైద్యవిభాగం: అనర్హులైన వారి వద్ద వైద్యం చేయించుకుంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి తెలిపారు. ఆక్యూ పంచర్, కేరళ వైద్యం, హెర్బల్ క్లినిక్‌ల పేరిట పలువురు రిజిస్ట్రేషన్ లేకుండా పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని చెప్పారు. ఈనేపథ్యాన ఖమ్మం ట్రంక్ రోడ్డులోని ఆక్యూ పంక్చర్ క్లినిక్‌ను గురువారం ఆమె తనిఖీ చేశారు. అక్కడ వైద్యుడిగా చెప్పుకుంటున్న నరేష్‌కుమార్‌కు రిజిస్ట్రేషన్ లేనందున మందలించారు. తమిళనాడుకు చెందిన ఆయన నరాలు నొక్కి చికిత్స చేస్తానని చెప్పుకుంటున్నందున పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు క్లినిక్‌ను సీజ్ చేశారు. ఆతర్వాత ఎన్టీఆర్ సర్కిల్‌లోని కేరళ వైద్యం పేరిట ఉన్న క్లినిక్‌ను సైతం సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. అనంతరం ఆమె జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఎన్‌సీడీ క్లినిక్‌ను పరిశీలించి అసంక్రమణ వ్యాధుల చికిత్స, మందుల లభ్యతపై సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌తో సమీక్షించారు. ఈ తనిఖీల్లో వివిధ విభాగాల పీఓలు చందూనాయక్, డి.రామారావు, ఉద్యోగులు సాంబశివరెడ్డి, దుర్గ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆక్యూపంక్చర్ క్లినిక్‌లో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

పర్యాటక ప్రాంతంగా ఖమ్మం ఖిల్లా

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం ఖిల్లాపైకి చేరేందుకు రోప్ వే ఏర్పాటుచేస్తుండడంతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందనుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. మెట్ల మార్గం ద్వారా అధికారులతో కలిసి గురువారం ఆయన ఖిల్లాపైకి వెళ్లి చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జాఫర్ బావిని పునరుద్ధరించగా ఖిల్లా అభివృద్ధి కూడా పూర్తయితే ఈ ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. అనంతరం రోప్‌వే ఏర్పాటుకు అనువైన మార్గం, సామగ్రి చేరవేసేందుకు రహదారి అనుకూలత, పార్కింగ్, టాయిలెట్ల ఏర్పాటుపై సూచనలు చేశారు. పర్యాటకులను ఆకట్టుకునేలా లైటింగ్ ఏర్పాటుచేయాలని తెలిపారు. తొలుత జాఫర్ బావిని ఆయన అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి పరిశీలించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, తహసీల్దార్ రవికుమార్, కేఎంసీ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న 'టెట్'

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న టెట్ ప్రశాంతంగా కొనసాగుతోందని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ వెల్లడించారు. ఏడు కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తుండగా గురువారం 1,398మందిలో 762మంది అభ్యర్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు.

అండర్-19 బాలికల క్రికెట్ జట్టు ఎంపిక



బాలికల జిల్లా జట్టుతో నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్/ముదిగొండ: జూనియర్ కళాశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-19 బాలికల క్రికెట్ జట్టు ఎంపికకు ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో గురువారం ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా జట్టుకు బషాని, శ్రీనిధి, ఝాన్సీ, రూప, వేదిత, దేవిక, స్పందన, ఆరాధ్య, స్పందన, చైతన్య, పావని, కీర్తన, హిమబిందు, గౌరీమంజలి ఎంపికయ్యారు. ఈ జట్టు 10వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని క్రీడా సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసాకలీం తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.నర్సింహామూర్తితో పాటు నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, జట్టులో ముదిగొండ మండలం బాణాపురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు దేవిక స్థానం దక్కగా.. వీరిని హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి ఖమ్మం మార్కెట్‌కు ఆరు రోజుల సెలవులు

ఖమ్మంవ్యవసాయం: ముక్కోటి, వారాంతం, సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల అభ్యర్థన మేరకు ముక్కోటి సందర్భంగా శుక్రవారం సెలవు ఇవ్వగా, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవుతో పాటు సోమ, మంగళ, బుధవారాల్లో సంక్రాంతి సందర్భంగా సెలవులు వచ్చాయని వెల్లడించారు. తిరిగి ఈనెల 16న గురువారం మార్కెట్ కార్యకలాపాలు మొదలవుతాయని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.


నీటి నమూనాలు సేకరించిన అధికారులు



పరీక్షల నిమిత్తం నీటిని సేకరిస్తున్న సిబ్బంది

కల్లూరురూరల్: కల్లూరు మండలం రఘునాథగూడెం బోర్ పంప్‌లో నీటి నమూనాలను పరీక్షల నిమిత్తం అధికారులు గురువారం సేకరించారు. గ్రామంలోని బోరు నీటిని తాగిన సుమారు 30 మంది అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఈనేపథ్యాన నీటి శాంపిళ్లు సేకరించిన అధికారులు ల్యాబ్‌కు పంపించారు. అలాగే, గ్రామంలో గురువారం కూడా వైద్యశిబిరం నిర్వహించి అస్వస్థతకు గురైన వారికి చికిత్స చేయించారు. ఎవరికీ ప్రమాదం లేదని చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ఇస్రత్ తబస్సుం తెలిపారు.

114 మందిపై బైండోవర్ కేసులు



స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కిరణ్

సత్తుపల్లి: సంక్రాంతి నేపథ్యాన కోడి పందెం, పేకాట జూదం నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ హెచ్చరించారు. గతంలో కేసులు నమోదైన 114మందిని గురువారం స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేసినందున జూదం నిర్వహించినా, వారికి తోటలు, భూములు ఇచ్చి ప్రోత్సహించినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కాగా, కోడి పందేలు, జూదం జరుగుతున్నట్లు తెలిస్తే 87126 59167, 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,600	6,210
అలసంద	6,700	6,700
మిర్చి	15,700	4,000
మిర్చి తాలు	8,200	5,000
ఏసీ మిర్చి	15,000	5,000
పత్తి	7,150	5,700

– ఖమ్మం వ్యవసాయం

పోలీసుల సేవలు ఎలా ఉన్నాయి?

- అభిప్రాయ సేకరణకు క్యూఆర్ కోడ్
- పోస్టర్లు విడుదల చేసిన సీపీ సునీల్‌దత్



క్యూఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: వివిధ సమస్యలపై స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసు సిబ్బంది ఎలా ప్రవర్తిస్తున్నారు.. కేసుల విచారణలో వారి పనితీరు ఎలా ఉందో తెలుసుకునేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు కోడ్ పోస్టర్లను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ గురువారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులు సమస్యలతో పోలీస్‌స్టేషన్లకు వచ్చిన సమయాన సిబ్బంది వ్యవహరించిన తీరు, ఫిర్యాదుల సేకరణ మొదలు పాస్‌పోర్ట్ దరఖాస్తుల పరిశీలన, ఈ-చలాన్లు, ఎఫ్ఐఆర్‌ల నమోదు తదితర సేవలపై అభిప్రాయాలు సేకరించేందుకు క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ పోస్టర్ల ఆధారంగా ప్రజలు వారి సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, ట్రెయినీ ఐపీఎస్ రుత్విక్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

పండుగకు వెళ్తున్నారా.. జాగ్రత్త

సంక్రాంతి సెలవుల్లో ఎక్కువ మంది స్వస్థలాలు, విహారయాత్రలకు వెళ్లనుండగా దొంగతనాలు జరగకుండా నిఘా ముమ్మరం చేస్తున్నామని సీపీ సునీల్‌దత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కమిషనరేట్ పరిధిలో వరుస చోరీలు జరుగుతుండగా 'సాక్షి'లో గురువారం 'తాళం వేస్తే కన్నం వేసినట్లే' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన సీపీ.. దొంగతనాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రకటన విడుదల చేశారు. రాత్రి వేళ పెట్రోలింగ్, బీట్ గస్తీ, కాలనీలతో పాటు బస్టాండ్లు, ఆటోఅడ్డాలు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు చేపట్టాలని ఉద్యోగులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే, స్వస్థలాలకు వెళ్లే ప్రజలు ఇంటి తాళం బయటకు కనిపించకుండా పరదా కప్పాలని, విలువైన ఆభరణాలు, నగదు బీరువాలో కాకుండా లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఊళ్లకు వెళ్లే వారు సమీపంలోని బంధువులతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తద్వారా గస్తీకి వచ్చినప్పుడు పరిశీలిస్తారని తెలిపారు. కాలనీల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతేకాక ఇళ్లలో సీసీ కెమెరాలు బిగించుకుని సెల్‌ఫోన్ నోటిఫికేషన్ల ద్వారా పరిశీలిస్తే దొంగతనాలను అరికట్టవచ్చని సీపీ తెలిపారు.

ముక్కోటి సందడి

ఖమ్మంగాంధీచౌక్: జిల్లాలో ముక్కోటి సందడి నెలకొంది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున వైష్ణవ ఆలయాల్లో స్వామి దర్శనం, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. సూర్యుడు ఉత్తరాయణంలోకి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటిగా పిలుస్తారు. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకుంటాయనే నమ్మికతో భక్తులు వైష్ణవాలయాల వద్ద ఉత్తర ద్వారం మీదుగా స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు జిల్లాలోని ఆలయాలకు భక్తులు భారీగా వచ్చే అవకాశం ఉండడంతో బారికేడ్లు, ఇతర ఏర్పాట్లు చేశారు. ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, ఏన్కూరు మండలంలోని గార్లొడ్డు ఆలయం, పెనుబల్లి, సత్తుపల్లి ప్రాంతంలోని వైష్ణవ ఆలయాల్లో, ఖమ్మం కమాన్‌బజార్‌లోని ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, త్రీటౌన్ హర్కారా బావి సెంటర్ సమీపాన రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీరంగనాథస్వామి ఆలయం, కస్బా బజార్‌లోని రామాలయం, ఎన్నెస్పీ రోడ్డులోని రామాలయం తదితర దేవాలయాలను ముక్కోటి వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు.



విద్యుత్‌లైట్ల వెలుతురులో ఖమ్మంలోని శ్రీ లక్ష్మీరంగనాథ స్వామి ఆలయం

40క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కారేపల్లి: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఖమ్మం టాస్క్‌ఫోర్స్, కారేపల్లి పోలీసులు గురువారం సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పాత చెన్నంగులగడ్డలో ఆవుల సంపత్ ఇంట్లో ఇల్లెందు మండలానికి చెందిన బత్తుల సంతోష్ 40 బియ్యాన్ని నిల్వ చేశాడు. పక్కా సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టి బియ్యాన్ని కారేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఘటనపై సంపత్, సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

కూసుమంచి: కూసుమంచి మండలం నాయకన్‌గూడెం మీదుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను కూసుమంచి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. నాయకన్‌గూడెం అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న ముగ్గురు పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వెంబడించిన పోలీసులకు ఇద్దరు పట్టుబడడంతో విచారించగా నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన కందుల అనిల్‌కుమార్, షేక్ యూసుఫ్‌గా తేలింది. వీరి నుండి 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోగా, సూర్యాపేట జిల్లా మోతె మండలం అన్నారుగూడెంకు చిలకబత్తిన వెంకటేష్, మండవ సాయితో కలిసి గంజాయి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో అనిల్, యూసుఫ్‌ను రిమాండ్‌కు తరలించి మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్సై నాగరాజు తెలిపారు.

12 అడుగుల కొండచిలువ హతం



కొండచిలువతో గ్రామస్తుడు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్‌లో 12 అడుగుల భారీ కొండ చిలువ కలకలం సృష్టించింది. గ్రామసమీపాన తాటివనం వద్దకు గురువారం కొందరు యువకులు వెళ్లారు. అక్కడ కొండ చిలువ కనిపించడంతో ఆందోళనకు గురైన వారు దాన్ని హతమార్చారు.

రాష్ట్రస్థాయి 'విద్యుత్' క్రీడాపోటీలు ప్రారంభం

ఖమ్మంలో ఫుట్‌బాల్, లాన్ టెన్నిస్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి విద్యుత్ శాఖ ఉద్యోగుల క్రీడా పోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ట్రాన్స్‌కో వరంగల్ జోన్ అధికారి జి.శ్రీరాంకుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను చిన్నచూపు చూడకుండా.. వ్యక్తిత్వ వికాసం, కీర్తిని పెంచేవిగా భావించాలని సూచించారు. ప్రతీ ఉద్యోగి క్రీడలపై ఆసక్తి పెంచుకోవడం ద్వారా శారీరక అభివృద్ధితోపాటు ఉత్తమ లక్షణాలు అలవాటవుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ బి.శ్రీనివాస్, అధికారులు బి.బాలునాయక్, ఎస్.జగన్నాథ్, ఎన్.నాగరత్నం, వీ.వీ.కృష్ణారావు, అంజన్‌రెడ్డి, పి.దాస్ తదితరులు పాల్గొన్నారు. తొలుత క్రీడాపతాకాలను అధికారులు ఆవిష్కరించగా, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

ఫుట్‌బాల్ పోటీల్లో కరీంనగర్ గెలుపు

తొలిరోజు కరీంనగర్ – ఖమ్మం జట్ల మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌లో కరీంనగర్, వరంగల్ – హబ్సిగూడ మధ్య మ్యాచ్‌లో వరంగల్ జట్టు గెలుపొందగా, నిజామాబాద్ – విద్యుత్‌సౌధ జట్ల నడుమ మ్యాచ్‌లో ఐదు గోల్స్ తేడాతో నిజామాబాద్ జట్టు ఘన విజయం సాధించింది. అలాగే, మహబూబ్‌నగర్ – నల్లగొండ జట్ల నడుమ మ్యాచ్‌లో 3–1 గోల్స్ తేడాతో మహబూబ్‌నగర్ జట్టు నెగ్గింది. ఇక లాన్ టెన్నిస్ పోటీల్లో విద్యుత్‌సౌధపై కరీంనగర్, కార్పొరేట్ ఆఫీస్(హైదరాబాద్)పై హబ్సిగూడ జట్టు విజయం సాధించాయి. కాగా, పోటీలు సెమీస్ దశకు చేరాయని నిర్వాహకులు తెలిపారు.



మాట్లాడుతున్న వరంగల్ జోన్ అధికారి శ్రీరాంకుమార్

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

రూ.8.60లక్షలు వసూలు చేసిన బుచ్చిరెడ్డిపాలెం వాసి

ఎర్రుపాలెం: విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తానంటూ పలువురు యువకుల వద్ద నగదు వసూలు చేసిన ముఖం చాటేసిన వ్యక్తిపై బాధితులు గురువారం ఎర్రుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం చింతలనర్వ, సత్యాలపాడుకు చెందిన యనమద్ది రవితేజ, వంగల శ్రీనివాసరావుకు ఉద్యోగాలు ఇప్పిస్తానని ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన లక్కిరెడ్డి పుల్లారెడ్డి నమ్మించాడు. యూరప్ ఖండంలోని మాల్టా దేశంలో ఉద్యోగాలు ఉన్నాయని, అక్కడకు వెళ్తే రూ.లక్షల్లో సంపాదించుకోవచ్చని చెప్పడంతో రవితేజ వద్ద రూ.4.85లక్షలు, శ్రీనివాసరావు 3.75 లక్షలు చెల్లించాడు. ఇందులో శ్రీనివాసరావును తాత్కాలిక పాస్‌పోర్టు ద్వారా ఆర్మేనియా పంపించి అక్కడి నుండి మాల్టా వెళ్లొచ్చని చెప్పాడు. అయితే, ఆర్మేనియా వెళ్లాక ఎవరూ పట్టించుకోకపోవడంతో మోసపోయిన గుర్తించిన శ్రీనివాసరావు తన స్నేహితుడైన రవితేజకు ఫోన్‌లో సమాచారం ఇవ్వగా ఆయన పంపించిన నగదుతో తిరిగి స్వస్థలానికి వచ్చాడు. ఆపై ఇద్దరూ కలిసి ఈనెల 6న పుల్లారెడ్డిని నిలదీయగా రెండు, మూడు రోజుల్లో డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి గ్రామం నుంచి వెళ్లిపోయాడు. దీంతో గత్యంతరం లేక బాధితులు గురువారం పోలీసులను ఆశ్రయించారు. అయితే, ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు, మైలవరం మండలం చంద్రగూడెంకు చెందిన కొందరు యువకులు కూడా మోసపోయినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్‌ఐ పి.వెంకటేష్‌ను వివరణ కోరగా ఫిర్యాదుపై విచారిస్తున్నామని తెలిపారు.



పోలీసులను ఆశ్రయించిన రవితేజ, శ్రీనివాసరావు

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

మధిర: మండలంలోని వంగవీడు నుంచి పలువురు యథేచ్ఛగా మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని ఎన్నెస్పీ భూముల్లో టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తున్నారు. దీంతో రైతులు వెళ్లి టిప్పర్లు, జేసీబీని అడ్డగించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇకనైనా అధికారులు నిఘా విస్తృతం చేసి దందాకు అడ్డుకట్ట వేయాలని వారు కోరారు.

బేతుపల్లి కాల్వ ఇంజనీర్ సీతారాములు కన్నుమూత

సత్తుపల్లి/ఖమ్మం వన్‌టౌన్: సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్దచెరువు వరద ఆధారంగా కరువు మండలమైన వేంసూరుకు సాగునీరు అందించేందుకు కృషి చేసిన రిటైర్డ్ ఇంజనీర్ తక్కెళ్లపాటి సీతారాములు ఖమ్మంలోని స్వగృహంలో బుధవారం కన్నుమూశారు. బేతుపల్లి కెనాల్ నిర్మాణానికి ఆయన ఏళ్ల క్రితం సర్వే చేసి నివేదిక సమర్పించారు. ఇరిగేషన్ శాఖలో జేఈ నుంచి ఎస్‌ఈ వరకు పదవుల్లో కొనసాగిన సీతారాములు ఇచ్చిన నివేదిక ఆధారంగా అప్పటి మంత్రి సిద్ధారెడ్డి బేతుపల్లి(ఎన్టీఆర్) కాల్వ ఆవశ్యకతను గుర్తించారు. ఆపై తుమ్మల నాగేశ్వరరావు తొలిసారి ఎమ్మెల్యే కాగానే కాల్వ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తద్వారా వేంసూరు మండలానికి బేతుపల్లి వరద జలాలు అందుతుండడంతో ఇప్పటికీ ఈ ప్రాంత రైతులు సీతారాములు గుర్తు చేసుకుంటారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట మేయర్ పునుకొల్లు నీరజతో పాటు షేక్ రషీద్ తదితరులు ఉన్నారు.



సీతారాములు (ఫైల్)

నాగిలిగొండలో సెల్‌టవర్ ఎక్కి నిరసన

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్

చింతకాని: మండలంలోని నాగిలిగొండకు చెందిన పామర్తి శ్రీను గురువారం సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. రెండు గంటల పాటు ఉత్కంఠకు గురి చేసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో పామర్తి శ్రీను పేరుతో ఇద్దరు ఉండగా, సెల్‌టవర్ ఎక్కిన శ్రీను భార్య లక్ష్మీతిరుపతమ్మ పేరిట మంజూరైన ఇందిరమ్మ ఇంటిని అదే పేరు కలిగిన వ్యక్తి(భార్య కళావతి) నిర్మించుకున్నాడని తెలిసింది. దీంతో ప్రజాపాలన సభల్లో లక్ష్మీతిరుపతమ్మ పేరుతో మరోమారు దరఖాస్తు చేస్తే ఇప్పటికే ఇల్లు మంజూరైనందున అనర్హుడిగా చెప్పారు. ఈవిషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని నాలుగు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయినా తన సమస్యల పరిష్కారం కావడం లేదని శ్రీను సెల్‌టవర్ ఎక్కగా ఎస్సై నాగుల్‌మీరా చేరుకుని నచ్చచెప్పినా దిగలేదు. చివరకు తహసీల్దార్ కూరపాటి అనంతరాజు ఫోన్‌లో మాట్లాడి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇంటి మంజూరుకు కృషిచేస్తానని చెప్పడంతో రెండు గంటల తర్వాత శ్రీను కిందకు దిగడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం గ్రామానికి తహసీల్దార్ రాగా శ్రీనుతో మాట్లాడారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ధంసలాపురం కొత్తూరు వద్ద అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం ఖమ్మం అర్బన్ పోలీసులు సీజ్ చేశారు. వాహనాల తనిఖీల్లో ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్లు అనుమతి లేదని తేలింది. దీంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి

కొణిజర్ల: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కొణిజర్ల పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని అంజనాపురానికి చెందిన అజ్మీరా రామారావు(50) గుబ్బగుర్తికి చెందిన ఓ రైతు పొలం కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. ఆయన గురువారం తెల్లవారుజామున చేనుకు నీరు పెట్టడానికి నడుస్తూ పొలానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై అక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, పిల్లలు ఉండగా కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో డీసీఎం డ్రైవర్...

ఖమ్మంరూరల్: డీసీఎంలో లోడ్‌తో వస్తున్న డ్రైవర్‌కు గుండెపోటు రాగా వాహనంలోనే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని కర్నూలు జిల్లా చౌట్కూర్‌కు చెందిన చాకలి త్యాగమూర్తి(46) మేడ్చల్‌లోని ఓ పైపుల ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన పైప్‌ల లోడ్‌తో జనగామ మీదుగా ఖమ్మం వస్తూ వరంగల్ క్రాస్ రోడ్డు సమీపాన గురువారం ఉదయం డీసీఎంను ఆపి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈక్రమాన గుండెపోటు రాగా మృతి చెందాడు. ఎంతకూ వాహనం రాకపోవడంతో డీలర్ సాయిధీరజ్ ఆయనకు ఫోన్ చేసినా స్పందన లేక ఎదురు వెళ్తుండగా వరంగల్ క్రాస్ రోడ్డు వాహనాన్ని గుర్తించాడు. అందులో పరిశీలించి త్యాగమూర్తి మృతి చెంది ఉండడంతో పోలీసులతో పాటు కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ

దక్షిణ భారత స్థాయి, జాతీయ స్థాయికి జిల్లా విద్యార్థుల ఎంపిక

ఖమ్మం సహకారనగర్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో గురువారం ముగిసిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ఒక ఎగ్జిబిట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా.. రెండు ప్రాజెక్టులు దక్షిణ భారత స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. అంతేకాక మూడు ప్రాజెక్టులకు రాష్ట్రస్థాయి బహుమతులు దక్కాయని జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్, ఇన్‌స్పైర్ అధికారి ఎనుముల వెంకటేశ్వర్లు తెలిపారు.

విజేతలు వీరే...

ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని రిజొనెన్స్ స్కూల్ విద్యార్థి సీహెచ్.అన్విత ప్రదర్శించిన కాలితో నొక్కుతూ ఆపరేట్ చేసే లిఫ్ట్ జాకీ ఎగ్జిబిట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే, దక్షిణ భారతస్థాయి పోటీలకు బురదరాఘవాపురం ప్రభుత్వ పాఠశాల నుంచి మహిమ సమర్పించిన గణితం ఎగ్జిబిట్, ఖమ్మం ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థి వివేకానంద రవాణా, సమాచార మార్పిడిపై ప్రదర్శించిన ఎగ్జిబిట్ ఎంపికయ్యాయి. అంతేకాకుండా రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ఖమ్మం త్రివేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి హరిచందన మిల్లెట్ల ఆవశ్యకత, యువన్ హైస్కూల్ విద్యార్థి సేంద్రియ వ్యవసాయంపై ఎగ్జిబిట్లు ప్రదర్శించి మొదటి బహుమతి సాధించగా, బ్లూమ్స్ హైస్కూల్ విద్యార్థి ఉషశ్రీ వ్యర్థాల నిర్వహణ విభాగంలో వేస్ట్ రాష్ట్రస్థాయి రెండో బహుమతి సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. కాగా, త్రివేణి విద్యార్థి హరిచందనను త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వరరావుతో పాటు సుబ్బారావు, కాట్రగడ్డ మురళీకృష్ణ, రాజేంద్రప్రసాద్, స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్ అభినందించారు.



బహుమతి అందుకుంటున్న త్రివేణి పాఠశాల విద్యార్థి హరిచందన

విస్తృతంగా సేవా కార్యక్రమాలు

పాఠశాల అభివృద్ధికి రూ.5లక్షలు ప్రకటించిన మట్టా దయానంద్

సత్తుపల్లిటౌన్: ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన తన తల్లి డాక్టర్ మట్టా ఆరోగ్యం స్ఫూర్తితో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ తెలిపారు. మాజీ ఎంపీపీ ఆరోగ్యం వర్ధంతి సందర్భంగా సత్తుపల్లి పాతసెంటర్ హైస్కూల్ అభివృద్ధికి గురువారం ఆయన రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. అలాగే, విద్యార్థుల ప్రోత్సాహానికి మరో రూ.2లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలకు చేరాలని, తద్వారా సమాజ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచించారు. అనంతరం ఎస్సెస్సీ విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, హెచ్‌ఎం ఆర్.శైలకుమారితో పాటు చల్లగుళ్ల నర్సింహారావు, దొడ్డా శ్రీనివాసరావు, గాదె చెన్నారావు, ఎం.డీ.ఫయాజ్‌అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలకు అభివృద్ధికి నగదు అందచేస్తున్న దయానంద్

విజయ డెయిరీ జూనియర్ మేనేజర్‌గా హన్మంతు

ఖమ్మంవ్యవసాయం: పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (విజయ డెయిరీ) ఖమ్మం యూనిట్ జూనియర్ మేనేజర్‌గా బి.హన్మంతు గురువారం విధుల్లో చేరారు. కొన్నాళ్ల క్రితం ఇక్కడ ఆరేళ్ల నుంచి పనిచేస్తున్న జూనియర్ మేనేజర్ పి.అశోక్‌కుమార్‌ను వరంగల్‌కు, వరంగల్ నుంచి హన్మంతును ఖమ్మం బదిలీ చేశారు. అయితే, ఖమ్మం యూనిట్ నిర్వహణ దృష్ట్యా అశోక్‌కుమార్‌ను ఇక్కడే కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయనను రిలీవ్ చేయగా ఆ స్థానంలో హన్మంతు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిద్దరిని ఉద్యోగులు సన్మానించారు. డెయిరీ డీడీ పి.మోహన మురళి, మేనేజర్ సిద్దేశ్వర్, ఉద్యోగులు నాగమణి, బాలప్రసాద్, మురళీకృష్ణ, శ్రీలత, రమణకుమార్, అప్పారావు, భాస్కర్, పార్వతి, నాగేశ్వర్‌రావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌కుమార్, హన్మంతును సన్మానిస్తున్న ఉద్యోగులు

డీఆర్‌డీఏలో ఏపీఎంల బదిలీ

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ)లో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం)ల బదిలీలు జరిగాయి. ఈమేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2015 నుండి ఒకేచోట పనిచేస్తుండడంతో జిల్లాలో పలువురు ఏపీఎంల బదిలీ చేపట్టారు. కాగా, ముదిగొండ, సింగరేణి ఏపీఎంలను పాత స్థానాల్లో కొనసాగిస్తుండగా, మిగతా వారికి స్థానచలనం కల్పించారు. ఇందులో భాగంగా వై.పద్మలతను బోనకల్ నుంచి ఖమ్మం రూరల్‌కు, బి.రాంబాబును మధిర నుంచి కల్లూరుకు, వై.వెంకటేశ్వర్లును ఎర్రుపాలెం నుంచి తిరుమలాయపాలెంకు, ఆర్.తిరుమలరావును చింతకాని నుంచి కూసుమంచికి, పి.శారదను రఘునాథపాలెం నుంచి నేలకొండపల్లికి, పి.హరినారాయణను ఏన్కూరు నుంచి ఎర్రుపాలెంకు, కె.శ్యాంకుమార్‌ను వైరా నుంచి కామేపల్లికి, ఐ.జ్యోతిప్రసన్నను కొణిజర్ల నుంచి పెనుబల్లికి, కె.సురేందర్‌బాబును కామేపల్లి నుంచి బోనకల్‌కు బదిలీ చేశారు. అలాగే, కే.వీ.సుబ్బారావును సత్తుపల్లి నుంచి రఘునాథపాలెంకు, బి.శ్రీనివాసరావును వేంసూరు నుంచి చింతకానికి, ఎం.వీ.రామారావును కల్లూరు నుంచి ఏన్కూరుకు, జి.చిన్నవెంకటేశ్వర్లును తల్లాడ నుంచి వైరాకు, బి.నాగపుల్లారావును పెనుబల్లి నుంచి కొణిజర్లకు, జి.అశోక్‌రాణిని నేలకొండపల్లి నుంచి తల్లాడకు, ఐ.సత్యవర్ధన్‌రాజును కూసుమంచి నుంచి సత్తుపల్లికి, సీహెచ్.అలివేలుమంగమ్మను తిరుమలాయపాలెం నుంచి వేంసూరుకు, ఎం.శ్రీనివాసరావును ఖమ్మం రూరల్ మండలం నుంచి మధిరకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.